ఈనాడు E-PAPER

October 20, 2016




గుంతకల్లు రైల్వే జంక్షన్

# బైపాస్ లైన్‌కు రూ.52 కోట్లు ఇవ్వలేం

## మొత్తాన్ని తగ్గించాలని రైల్వేబోర్డు ఆదేశాలు

**రైల్వేజంక్షన్ (గుంతకల్లు), న్యూస్‌టుడే:** బైపాస్‌లైన్ కోసం రూ. 52 కోట్లు విడుదల చేయాలంటే కుదరదు. ఈ మొత్తాన్ని తగ్గించి తిరిగి నివేదికను పంపాలని రైల్వేబోర్డు గుంతకల్లు రైల్వే అధికారులను ఆదేశించింది. గుంతకల్లు రైల్వే జంక్షన్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లకు సంబంధించి ఇంజిన్లను మార్చాల్సిన (షంటింగ్) అవసరం లేకుండా రైళ్లు నేరుగా వెళ్లడానికి బైపాస్‌లైన్‌ను నిర్మించాలని రైల్వేబోర్డు ఏడేళ్ల కిందట నిధులను మంజూరు చేసింది. నాడే పనులు ప్రారంభించి ఉంటే రూ. 22 కోట్లతో పూర్తయ్యేవి. అధికారులు లైన్ నిర్మాణం విషయంలో పలు మార్పులు, చేర్పులు చేస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు రైల్వేబోర్డుకు అధికారులు 12 సార్లు నివేదికలను సమర్పించారు. ప్రతి సంవత్సరం బోర్డు బైపాస్‌లైన్ పనులకోసం రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్లు కేటాయించడం.. ఆతర్వాత ఆ నిధులను వేరేపనులకు మళ్లించడం డివిజన్‌లో సాధారణం అయిపోయింది. రైల్వే జంక్షన్ నుంచి బళ్లారి, రాయచూరు, ద్రోణాచలం లైన్లను కలుపుతూ బైపాస్‌లైన్‌ను నిర్మించాల్సి ఉంది. మొత్తం 8 కి.మీ.ల ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. ట్రాక్ నిర్మాణానికి అవసరమైన స్థలానికి సంబంధించి రైల్వే ఇంజినీర్లు సంవత్సరం కిందట హద్దులను ఏర్పాటు చేశారు. భూసేకరణ ఆగిపోయింది. బైపాస్‌లైన్ నిర్మాణం పూర్తి అయితే రైళ్ల ఇంజిన్లను మార్చడానికి గంట పాటు జంక్షన్‌లో నిలబడే సమస్య ఉండదు. ప్రయాణికులు సకాలంలో గమ్యం చేరడానికి వీలు ఏర్పడుతుంది. ఫలితంగా నిర్మాణ వ్యయం ఏటా పదిశాతం పెరుగతోంది. రైల్వే బోర్డు నిర్మాణ వ్యయయాన్ని తగ్గించాలని ఆదేశించిన విషయం వాస్తవమేనని డివిజన్‌కు చెందిన అధికారులు చెప్పారు. అంచనాలు ఆమోదం పొందేవరకు టెండర్లను నిర్వహించడానికి వీలులేదన్నారు. ప్రస్తుతం నిర్మాణ వ్యయాన్ని తగ్గించి తిరిగి నివేదికలను తయారు చేస్తున్నామని అధికారులు చెప్పారు.

© 2016 all rights reserved